క్లుప్తంగా...

నేడు డయల్ యువర్ ఆర్ఎం

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ సమస్యలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం బుధవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్‌ల నుంచి బయలు దేరే జిల్లా సర్వీసు బస్సులు, హైదరాబాద్ డిపో-1, హైదరాబాద్ డిపో-2, పికెట్, మియాపూర్-1, బీహెచ్ఈఎల్, పరిగి, తాండూర్, వికారాబాద్ డిపోలకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26241లో సంప్రదించాలని సూచించారు.

లింబాద్రికి సన్మానం



లింబాద్రిని సత్కరిస్తున్న గడ్డం సత్యనారాయణ తదితరులు

చార్మినార్: ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆర్.లింబాద్రిని మంగళవారం చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయనకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకుడు మందాల భాస్కర్‌రావు, బీఆర్ఎస్ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నాయకుడు రావుల విజయ్‌కుమార్, యువజన నాయకుడు జీవీఎస్ రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

గోల్కొండ కోటలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్‌చారి

గోల్కొండ: గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆషాఢమాసంలో అమ్మవార్లకు గురు, ఆదివారాల్లో పూజలు జరుగుతాయి. అయితే వివిధ రోజుల్లో సైతం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. మంగళవారం జరిగిన పూజల్లో భక్తులతో పాటు ఆలయ ఈఓ శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రజాబలం లేదని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ పూర్తిగా ఉనికి కోల్పోతుందని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలక పార్టీకి తోకగా మారిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌ను ఏనాడో తిరస్కరించారని ఆయన అన్నారు. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి బలమైన కేడర్‌తో పాటు ఓటు బ్యాంకు ఉందని ఆయన అన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.

అంజన్‌కుమార్‌కు ఆహ్వానం



అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పాండుయాదవ్ తదితరులు

అబిడ్స్: మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు విఠోబ ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 29న జంగల్ విఠోబ ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పాండురంగా రథయాత్రకు రావాలని ఆలయ నిర్వాహకులు పాండుయాదవ్‌తో పలువురు నాయకులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. పెద్ద ఎత్తున ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

హోంమంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



చార్మినార్: రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని బీఆర్ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి షబ్బీర్ అహ్మద్, బీఆర్ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు శివయాదవ్, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగ్‌రావు, శివకుమార్, ఐ.ఎస్.సదన్ మాజీ అధ్యక్షులు మన్నే శ్రీరంగ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు హోంమంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

ట్రాన్స్‌కో.. మేలుకో..

- ఖాజీపురాలో ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ వైర్లు
- కిందకు వేలాడుతుండడంతో భయాందోళనకు గురవుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

శాలిబండ: డివిజన్ పరిధిలోని ఖాజీపురాలో 11కేవీ విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ స్థానికులకు ప్రమాదకరంగా మారాయి. ప్రతిరోజూ ఈ దారిలో విద్యార్థులు, ప్రజలు, ఆటో డ్రైవర్లు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్ల నుంచి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక బస్తీవాసులు, వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకోండి..



ఖాజీపురాలో 11కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించాలంటే స్థానికులు భయపడుతున్నారు. స్థానికంగా వ్యాపారాలు నిర్వహించాలంటేనే భయం వేస్తుంది. దీనిపై విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాం. అయినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగకుముందే తగిన చర్యలు తీసుకోండి. – మహ్మద్ షాహిద్ అలీ, వ్యాపారస్తుడు



కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ వైర్లు

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పించేందుకు పోతరాజుల నృత్యలతో బయలుదేరిన అలయ కమిటీ సభ్యులు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం బోనాల వజ్రోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ తరఫున లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పోతరాజుల నృత్యలతో ఆలయం నుంచి బయలుదేరిన సభ్యుల బృందం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం సింహవాహిని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన వారిని సన్మానించారు. అక్కన మాదన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, సభ్యులు రాజారత్నం, డాక్టర్ భరత్‌ప్రకాష్, సతీష్, క్రాంతికుమార్, జగ్మహన్‌కపూర్, శ్రీనివాస్, గోపాల్, సాయికిరాణ్, ముఖేష్‌యాదవ్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఈసారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. ఆషాఢబోనాల ఉత్సవం సందర్భంగా ఇప్పటి వరకు అమ్మవారికి 2 పూజలు జరిగాయి. మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో 2 పూజల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.2,38,695లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి తదితరులున్నారు.

పండగలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పండగలు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బక్రీద్, బోనాల పండగ ఏర్పాట్లపై మంగళవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా జీవాల విక్రయాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వచ్చే గురువారం గోల్కొండ కోట అమ్మవారికి జరిగే 3 బోనం పూజకు భారీగా భక్తులు తరలివస్తారని, అదే రోజు బక్రీద్ కూడా రావడం దేవుడు హిందూ ముస్లింలకు ఇచ్చిన వరమని ఆయన అన్నారు. అనంతరం ఆయన అమ్మవారి ఘటాల ఊరేగింపు ఏర్పాట్లను గోల్కొండ కోట, కోట చౌరస్తా, బడాబజార్, చోటా బజార్, తదితర ప్రాంతాల్లో తిరిగి పోలీసులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే, సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ అశ్వాక్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ శివమారుతి, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, కుతుబ్‌షాహీ ఈద్గా కమిటీ అధ్యక్షుడు గులాంమొహియుద్దీన్‌ఖాన్ పాషాభాయ్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్, పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ రాజు వస్తాద్, షానవాజ్ ఖాన్, న్యాయవాది మీర్జా ఎక్బాల్ అహ్మద్, ఎంఏ బేగ్ తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నవనీతరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కోశాధికారి శ్రవణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాములు సమష్టిగా సీఎం కేసీఆర్‌కు ఒక లేఖను రాశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కేసీఆర్‌కు అనేక పర్యాయాలు విన్నవించుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ ద్వారానైనా మా సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం అవుతాయని విశ్వసిస్తున్నట్లు వారు తెలిపారు. రెండవ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి మునుపటిలాగే మంచి ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల కోసం ఆరోగ్య ట్రస్ట్, స్వాస్థ్య కేంద్రాలు (వెల్‌నెస్ సెంటర్స్), ఆరోగ్య కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ చెల్లింపులు, కేసీఆర్ ఇచ్చిన ప్రత్యేక ప్రోత్సాహక హామీ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: మంగళ్‌హాట్ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్ శశికళ కృష్ణతో కలిసి ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభించారు. గుఫానగర్‌లో రూ.9 లక్షల విలువైన కమ్యూనిటీహాల్, అజీజ్‌బాగ్‌లో రూ.7లక్షల విలువైన సీసీ రోడ్లు, గోషామహల్ పరిధిలోని జుంగుర్‌బస్తీలో రూ.9లక్షల విలువైన వర్షపునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ కృష్ణ, బీజేపీ నాయకులు నరహరి, అంబేడ్కర్, అనిల్‌గౌడ్, సిద్ధార్థ్, శశికాంత్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు దేశవ్యాప్త ఆదరణ

అబిడ్స్: తెలంగాణ తరహాలోనే బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే అన్ని రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. ఆశీష్‌కుమార్‌యాదవ్‌ను సోలాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు బాగీరథ్ భరత్ బాల్కే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర నలుమూలలా బీఆర్ఎస్ ప్రభంజనం వీస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని ఆదరిస్తున్నారన్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఇన్‌స్పెక్టర్ రవి

అబిడ్స్: నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి.పేర్కొన్నారు. గోవులను కానీ, ఇతర పశువులను కానీ ఎవరైనా ఇతర ప్రాంతాలకు తరలిస్తే తాము చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. బక్రీద్ సందర్భంగా కింగ్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్, మొఘల్‌కానాలా ప్రాంతాల్లో రెండు పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రౌండ్ ది క్లాక్ పద్ధతిలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రశాంతంగా, శాంతియుతంగా అందరూ బక్రీద్ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి కానీ ఎవరైనా పశువులను, ఆవులను ఎలాంటి పత్రాలు లేకుండా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను తరలించినా, తీసుకువెళ్లినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఎంజే మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మాలకుంట, కరాచి బేకరీ, ఉస్మాన్‌గంజ్, రిజిస్ట్రార్ కార్యాలయం, హోటల్ మ్యాక్సిన్, శ్రావన్ ఆస్పత్రి, ఎంజే మార్కెట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనతో తెలిపారు. అలాగే 11 కేవీ ఫీల్‌ఖానా విద్యుత్ ఫీడర్ పరిధిలోని నింబు మార్కెట్, అజీజ్ ప్లాజా, రంగాచారి, ఫీల్‌ఖానా, ఆర్‌కే కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గోల్కొండలో రాత్రిపూట బైక్ రేస్‌లు

గోల్కొండ: గోల్కొండలో రాత్రిపూట బైక్‌లపై యువకులు హల్‌చల్ చేస్తున్నారు. గోల్కొండ కోట, మోతీ దర్వాజ, బడాబజార్ తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ అర్ధరాత్రి రేస్‌లను తలపించే విధంగా బైక్‌లను నడుపుతున్నారు. గుంపులుగా బైక్‌లపై యువకులు వేగంగా బైక్‌లు నడుపుతూ హల్‌చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి 12 నుంచి ఈ విధంగా బైక్‌లపై హల్‌చల్ చేస్తున్నారని, పోలీసులు వీరిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి వేగంగా వాహనం నడిపే వారిని అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు..



తవ్వేసిన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

గౌలిపురా: గౌలిపురా డివిజన్ ఎస్సార్టీ కాలనీ భారత్‌నగర్‌లో తవ్వేసిన రోడ్డుతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరు నెలల క్రితం ఈ ప్రాంతంలో రోడ్డు పనులను చేపట్టేందుకు రోడ్డును తవ్వేశారు. అనంతరం రోడ్డును వేయకుండా పనులను అర్ధాంతరంగా వదిలేశారు. స్థానికంగా రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండటంతో తవ్వేసిన గుంతల్లో వర్షపు నీరు చేరుతుంది. ఈ వర్షపు నీటిలో దోమలు వ్యాప్తి చెందడంతో స్థానికంగా అపరిశుభ్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆరు నెలల క్రితం తవ్వి వదిలేసిన బస్తీలోని రోడ్డు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సంతోష్‌నగర్: అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కంచన్‌బాగ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం .. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిధాని హట్స్, జీఎం నగర్ ప్రాంతాల్లో స్థానికంగా ఉండే ఆటో డ్రైవర్ ముదావత్ దేవ (27) అక్రమంగా వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ పోలీసులు స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముదావత్ దేవను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితునితో పాటు మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ పోలీసులకు అప్పగించారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

చాంద్రాయణగుట్ట: ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ అన్నారు. ఫలక్‌నుమా డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎం జాకీర్ హుస్సేన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గెలాక్సీ కాలేజీ చైర్మన్ అసముద్దీన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ సచిన్, అసిస్టెంట్ మేనేజర్లు రాజయ్య, దయాకర్, సైదులు, డిప్యూటీ సూపరింటెండెంట్ కోదండ పాల్గొన్నారు.

మిధానిలో రక్తదాన శిబిరం ప్రారంభం

సంతోష్‌నగర్: మిధాని బస్సు డిపో ఆవరణలో మిధాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్త దాతలకు ఆయన పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం రీజినల్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తం ఎంతోగానో ఉపయోగపడుతుందని.. రక్తాన్ని దానం చేయడానికి ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మిధాని డిపో మేనేజర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో..

గోల్కొండ: ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం చేస్తుందని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మెహిదీపట్నంలోని ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రవేశపెట్టిన పథకాలు విజయవంతమయ్యాయన్నారు. కొంత కాలంగా సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ప్రవేశపెడుతున్న నూతన విధానాల వల్ల ఆర్టీసీ ఆదాయం పెరగడమే కాకుండా ఆర్టీసీ నిర్వహణలో మరింత పారదర్శకతను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రెహమాన్, అంజమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్

సీఎస్ఐఆర్–ఐఐఎంపీతో ఎన్ఎండీసీ ఒప్పందం



సమావేశంలో ఎన్ఎండీసీ, టీఎస్ఐఆర్ ఐఐఎంపీ ప్రతినిధులు

గోల్కొండ: పరిశోధన సంస్థలతో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒప్పందాలు చేసుకోవడం శుభపరిణామమని ఎన్ఎండీసీ డైరెక్టర్, ప్రొడక్షన్స్ దిలీప్ కుమార్ మొహంతీ అన్నారు. భువనేశ్వర్‌కు చెందిన సీఎస్ఐఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ టెక్నాలజీ వారితో ఒప్పందం చేసుకున్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎన్ఎండీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్ఎండీసీ, సీఎస్ఐఆర్ ఐఐఎంపీ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను ఒకరికొకరు ఇచ్చుకున్నారు. ఈ సందర్భంగా మొహంతీ మాట్లాడుతూ.. దేశంలో ఇనుప ఖనిజ ఉత్పత్తిలో ఎన్ఎండీసీ అగ్రగామిగా ఉందని, సీఎస్ఐఆర్ పరిశోధనలు ఖనిజ ఉత్పత్తికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. మైనింగ్‌లో నూతన ఆవిష్కరణల కోసం ఎన్ఎండీసీ ఎంతగానో కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ కమర్షియల్ విభాగం డైరెక్టర్ విశ్వనాథ్ సురేష్ తదితరులున్నారు.

'కళలతో మానసిక ఒత్తిడి దూరం'



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. కవిత దరియానిరావు, రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్ తదితరులు

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మనస్సును ఆహ్లాదపరిచేందుకు కళలు తోడ్పడుతాయని జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో విస్టాక్ట్ 23 పేరిట అప్లయిడ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాఖండాలను ఆమె మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ గంగాధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫైనార్ట్స్ విద్యార్థులకు దేశ విదేశాలలో అపారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ జూలై 1వ తేదీ వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిలకించవచ్చని నిర్వాహకులు తెలిపారు. కమల్‌రాయ్, నాగేశ్వరచారి, నరేందర్, రాజేందర్ నాగుల, సురేఖ పాల్గొన్నారు.

దర్పల్లి తేజాస్‌కు షూటింగ్‌లో సిల్వర్ మెడల్

జియాగూడ: తెలంగాణ 9వ రైఫిల్ షూటింగ్ పోటీలలో జియాగూడకు చెందిన దర్పల్లి తేజాస్ కురుమ 25 మీటర్ల పిస్తోల్ జూనియర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఇటీవల గచ్చిబౌలిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని షూటింగ్ రేంజ్ పోటీలలో జియాగూడ విద్యశ్రీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న తేజాస్ కురుమ సిల్వర్ మెడల్ సాధించాడు. ముఖ్యఅతిథిగా తెలంగాణ పోలీస్ ఐజీ తరుణ్‌జోషి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్ అభినవ్ విచ్చేసి విజేతలకు మెడల్స్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమిత్ సాంగి, ఉపాధ్యక్షులు ఉదయ్ పిలాని, కోచ్ అల్లూరి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.



మజ్లిస్‌తోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మజ్లిస్ నాయకుడు నాగరాజు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు వర్కల నాగరాజు అన్నారు. ఉప్పుగూడ డివిజన్‌లోని శివాజీనగర్‌లో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 2014 నుంచి మజ్లిస్ హయాంలోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, ఉప్పుగూడ మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్, ప్రస్తుత కార్పొరేటర్ ఫహద్ బిన్‌లు డివిజన్ అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. నాయకులు బాబు, అంజయ్య, శంకు తదితరులు పాల్గొన్నారు.

దర్గాగా చారిత్రక స్థలం కబ్జా

గోల్కొండ: ఓ చారిత్రక స్థలాన్ని కొందరు దర్గాగా కబ్జా చేస్తున్నారు. అక్కడ అక్రమ నిర్మాణానికి చకచకా పనులు చేయిస్తున్నారు. గోల్కొండ కోట సమీపంలోని సెవన్ టూంబ్స్, దక్కన్ పార్కులు ఉన్నాయి. కాగా ఇదే ప్రదేశంలో కుతుబ్‌షాహీ ఈద్గా కూడా ఉంది. ఈ ప్రదేశంలో ఎన్నో మెట్ల బావులు కూడా ఉన్నాయి. ఈ మెట్ల బావులకు ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ వారు ఆధునీకరించి కొత్త జీవం పోస్తున్నారు. అంతేకాకుండా కుతుబ్‌షాహీ ఈద్గా సమీపంలోనే ఈద్గా బౌలి కూడా ఉంది. ఈద్గాను ఆనుకుని కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు. రెండేళ్ల క్రితం జరిగిన కబ్జా యత్నాన్ని అప్పటి అధికారులు అడ్డుకట్ట వేసి గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో కబ్జాదారులపై కేసు కూడా బుక్ అయ్యింది. అయితే పట్టువదలని కబ్జాదారులు అదే స్థలాన్ని మరొకరి పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసుకున్నారు. అంతటితో ఆగకుండా ఈ ప్రాంతంలో భవన నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ కబ్జా వెనుక ఓ పెద్ద అధికారి అండ ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఎలాగైనా అధికారులు చారిత్రక స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్న అడ్డుకుని కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.



కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు